సాక్షి రంగారెడ్డి

ఆదివారం | 4 | ఆగస్టు | 2024

స్నేహమే జీవితం

'స్నేహం'.. ఈ రెండక్షరాల మాటున ఉండే ఆ ప్రత్యేక అనుబంధమే వేరు. స్నేహానికి జాతి, మతం.. చిన్నా, పెద్దా.. బీద, ధనిక బేధాలు లేవు. కుటుంబ సభ్యుల తర్వాత అంతటి విలువ ఇచ్చేది.. ఆత్మీయతానురాగాలు పంచుకునేది స్నేహితులతోనే అనడంలో అతిశయోక్తి లేదు. కష్టం వచ్చినా.. బాధ కలిగినా.. సంతోషమేసినా పంచుకునేది మిత్రులతోనే.



- వివరాలు 8లో

న్యూస్‌రీల్

ధరణి దరఖాస్తులు పరిష్కరించాలి



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను మూడు రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ శశాంక సంబంధిత తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శనివారం సీసీఎల్ కమిషనర్ నవీన్‌మిట్టల్ జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లా రెవెన్యూ యంత్రాంగంతో కలిసి పాల్గొన్నారు. అనంతరం చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, కందుకూరు, గండిపేట, మాడ్గుల, మంచాల, యాచారం మండలాల్లో దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలో పెండింగ్ ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజుల్లో వీటికి పరిష్కార మార్గం చూపాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, ఆర్డీఓ సూరజ్‌కుమార్, అనంతరెడ్డి, సాయిరాం, వెంకటరెడ్డి సహా ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన

సాక్షి, రంగారెడ్డిజిల్లా: బడంగ్‌పేట్, తుర్కయంజాల్, పెద్ద అంబర్‌పేట్, షాద్‌నగర్‌లో ఎల్‌ఆర్‌ఎస్ అప్లికేషన్లు ఎక్కువగా ఉన్నాయని, వీటి పరిష్కారంలో అత్యంత జాగ్రత్త వహించాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ శశాంక మాట్లాడారు. యూఎల్‌బీలలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. 2020 ఆగస్టు 31 నుంచి అక్టోబర్ 31 వరకు స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను మూడుదశల్లో పరిశీలించేందుకు రెవెన్యూ, ఇరిగేషన్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు.

అంగన్‌వాడీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలోని అంగన్‌వాడీల్లో అన్ని మౌలిక సదుపాయాలను త్వరితగతిన సమకూర్చాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులకు సూచించారు. ఈ మేరకు శనివారం మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 1600 అంగన్‌వాడీలు ఉన్నాయని, ఏడు ప్రాజెక్టుల ద్వారా 95 వేల మంది పిల్లలకు, 18 వేల మంది బాలింతలు, గర్భిణులకు అవసరమైన పౌష్టికాహారం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 15లోగా అన్ని కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు సమకూర్చాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో శిశుసంక్షేమశాఖ అధికారిణి పద్మజా రమణ, సీడీపీఓలుతదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ట్రాన్స్‌కో కార్మికుడి మృతి



బాలుచారి (ఫైల్)

కొత్తూరు: విద్యుదాఘాతంతో ట్రాన్స్‌కో కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కొడిచర్లకు చెందిన బాలుచారి(35) కొన్నేళ్లుగా ట్రాన్స్‌కోలో ఆర్టిజన్ (హెల్పర్)గా విధులు నిర్వర్తిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం సిద్ధాపూర్ శివారులో 11కేవీ స్తంభం వద్ద జంపర్ తెగిపోయింది. సమాచారం రావడంతో బాలుచారి అక్కడికి చేరుకుని మరమ్మతులు చేసేందుకు స్తంభం పైకి ఎక్కాడు. మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం మహేశ్వరం మండలం మన్సాన్‌పల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణం ట్రాన్స్‌కో సిబ్బంది సమన్వయ లోపమా..? స్తంభం ఎక్కి మరమ్మతులు చేయడానికి ముందు బాలుచారి విద్యుత్ సరఫరా నిలిపివేయాలని (ఎల్‌సీ) అనుమతులు తీసుకున్నాడా..? లేదా..? అనే విషయాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంపై ఏఈ సాయికృష్ణను వివరణ కోరగా మరమ్మతులకు ముందు అనుమతులు తీసుకోనట్లు ప్రాథమికంగా తెలిసిందన్నారు.



సండే స్పెషల్

ఎలక్ట్రిక్ రైడ్

మార్కెట్‌లో ఎలక్ట్రిక్ వాహనాల జోరు

- కాలుష్య రహితం .. ఖర్చు మితం
- తగ్గిన ఇం'ధన' వెతలు
- ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు
- ఆసక్తి చూపుతున్న వాహనదారులు

ఉరుకులపరుగుల జీవనగమనంలో త్వరగా 'గమ్యం' చేరేందుకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత వాహనాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో వాటి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.. అదే క్రమంలో ఇంధన ధరలు అంతకంతకూ పెరుగుతూ పోతున్నాయి.. ఈ నేపథ్యంలో మిగులు 'బడ్జెట్' కోసం వాహనదారులు ఎలక్ట్రిక్ వెహికిల్స్‌పై ఆసక్తి కనబరుస్తున్నారు. ఇంధనం ఖర్చు లేకపోవడం.. జీరో మెయింటెనెన్స్.. కారణంగా చాలా మంది వీటి వైపు మొగ్గు చూపిస్తున్నారు. రోజురోజుకూ కాలుష్యం పెరిగిపోతుండడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలక్ట్రిక్ ఆధారిత వాహనాల కొనుగోలును, వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయి. సాధారణ కార్లు, బైక్‌లు, స్కూటీలతో పోలిస్తే తక్కువ ఖర్చు అవుతోందని, సౌకర్యంగానూ ఉందని వినియోగదారులు చెబుతున్నారు. పెట్రోల్, సర్వీసింగ్ ఖర్చులు మిగులుతుండడం.. ఒక్కసారి చార్జింగ్ చేస్తే చాలు వంద కిలోమీటర్ల వరకు వెళ్లే అవకాశం ఉండడంతో 'ఈ–బైక్'లు, 'ఈ–కార్ల'పై రయ్‌మని దూసుకెళ్తున్నారు.

ఎలక్ట్రిక్ వాహనాల హవా

షాద్‌నగర్: ఎలక్ట్రిక్ వాహనాలు పొదుపుగా ఉండటమే కాకుండా పర్యావరణానికి హాని కలిగించవు. బ్యాటరీతో నడిచే ఈ వాహనాలు ఇంధనంతో నడిచే వాహనాల్లా కాలుష్యాన్ని పెంచవు. మారుతున్న వాహదారుల అభిరుచులకు అనుగుణంగా వాహనాల తయారీ సంస్థలు కొత్తకొత్త ఎలక్ట్రిక్ వాహనాలను మార్కెట్‌లోకి తీసుకొస్తున్నాయి. ప్రస్తుతం పట్టణాల్లోనే కాకుండా గ్రామాల్లోనూ ఈ–బైక్‌లు తిరుగుతున్నాయి.

ఖర్చులు మిగులు



పెట్రోల్‌తో నడిచే వాహనాలకు నెలకు ఇంధనం, సర్వీసింగ్ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ బైక్ వాడుతున్నాను. పెట్రోల్, సర్వీసింగ్ ఖర్చులు మిగులుతుండటంతో ఆదా అవుతోంది. ఒక్కసారి చార్జింగ్ చేశామంటే చాలు సుమారు వంద కిలోమీటర్ల దూరం వెళ్లొచ్చు.

– సయ్యద్ మాజ్, షాద్‌నగర్



ఒక్కసారే పెట్టుబడి

ఎలక్ట్రిక్ బైక్ కొనుగోలు చేసేందుకు ఒక్కసారే పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఈ వాహనాలతో కాలుష్యాన్ని నివారణే కాకుండా సాధారణ ద్విచక్రవాహనాల కంటే ఖర్చు కూడా చాలా తక్కువ. ప్రభుత్వాలు మరింత రాయితీ అందిస్తే వినియోగం ఇంకా పెరుగుతుంది.

– అంజద్, కొత్తూరు

అన్ని విధాలా ప్రయోజనం



తలకొండపల్లి: మార్కెట్లోకి వచ్చిన కొత్తలో రూ.75 వేలతో ఎలక్ట్రిక్ వాహనం కొన్నాను. ఈ వాహనంతో సౌండ్ పొల్యూషన్ తగ్గడంతోపాటు పర్యావరణానికి హాని ఉండదు. గతంలో పెట్రోల్ బండి ఉపయోగించిన సందర్భంలో నిత్యం రూ.150 నుంచి రూ.250 వరకు ఖర్చయ్యేది. ఎలక్ట్రిక్ వాహనంతో అంతే దూరం ప్రయాణం చేసినా రోజుకు రూ.75 నుంచి రూ.125 మాత్రమే ఖర్చవుతోంది. కొని మూడేళ్లు అవుతోంది. ఎలాంటి ఇబ్బంది లేదు. పెట్రోల్ ఖర్చు లేదు. సర్వీసింగ్ చేయాల్సిన పని లేదు. అన్ని విధాలా ప్రయోజనకారిగా ఉంది.

– యాదయ్య, వాహనదారుడు, తలకొండపల్లి

ఆదాతో ఈఎంఐ కట్టొచ్చు



ఇబ్రహీంపట్నం: బ్యాటరీతో నడిచే టూ వీలర్ కొనుగోలు చేసి సుమారు రెండేళ్లు కావస్తోంది. రెండు బ్యాటరీలు తీసుకున్నాను. సుమారు నాలుగున్నర గంటల పాటు చార్జింగ్ పెట్టాలి. ఒక్కసారి చార్జింగ్ చేస్తే 130 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయొచ్చు. పెట్రోల్‌కు రోజుకు రూ.100 నుంచి రూ.150 వరకు ఖర్చయ్యేది. ఇప్పుడు ఆ ఖర్చు తప్పింది. ఆ డబ్బుతో నెలవారీ ఈఎంఐ చెల్లించొచ్చు. డబ్బులు ఆదా అవుతున్నాయి. పొల్యూషన్ ప్రాబ్లం ఉండదు. బైక్‌కు ఏదైనా పార్ట్ అవసరమైతే మాత్రం షోరూంకు వెళ్లి రిపేర్ చేయించుకోవాల్సి వస్తోంది. వాటి ఖరీదు కొద్దిగా ఎక్కువగా ఉంటాయి.

– యాదయ్య, ఆక్టోపస్ 4వ బెటాలియన్ కానిస్టేబుల్, ఇబ్రహీంపట్నం

జీరో మెయింటెనెన్స్

పర్యావరణ హితం

షాబాద్: ఎలక్ట్రిక్ వాహనాలు ఒక్కసారి కొనుగోలు చేస్తే వినియోగించినన్ని రోజులు జీరో మెయింటెనెన్స్‌తో ప్రయాణం చేయొచ్చని వాహనదారులు చెబుతున్నారు. మండల పరిధిలోని కుమ్మరిగూడ గ్రామానికి చెందిన పెద్దెటి జ్ఞానేశ్వర్ 9 నెలల కిత్రం ఓలా కంపెనీకి చెందిన స్కూటీని కొనుగోలు చేశాడు. ప్రతిరోజు ఆరున్నర గంటల పాటు చార్జింగ్ పెడితే 150 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేయొచ్చని చెబుతున్నాడు. 40 కిలోమీటర్ల వేగంతో వెళ్తే 150 కిలోమీటర్లు ప్రయాణం చేయొచ్చని, 80 స్పీడ్‌తో వెళ్తే 100 కిలోమీటర్లు ప్రయాణం చేయొచ్చని, 95 స్పీడ్‌తో వెళ్తే 80–90 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేయొచ్చని వివరించాడు. దీని ద్వారా పర్యావరణాన్ని కాపాడే అవకాశం ఉందంటున్నాడు.






పెట్రోల్, డీజిల్ భారం తప్పింది..

పెట్రోల్, డీజిల్ భారాన్ని తగ్గించేందుకు మార్కెట్‌లోకి ఎలక్ట్రిక్ వాహనాలు అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందని మండలంలోని ఎల్గొండగూడ గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి అంటున్నాడు. పది నెలల క్రితం మహీంద్ర 400 కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ కారును కొనుగోలు చేశాడు. ఇంటి వద్ద ఐదు గంటల పాటు చార్జింగ్ పెడితే బ్యాటరీ ఫుల్ అయి 270 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేయొచ్చని తెలిపాడు. ఇందుకు రూ.200 వరకు ఖర్చవుతుందని స్పీడును బట్టి మైలేజ్ తగ్గుతూ, పెరుగుతూ ఉంటుందంటున్నాడు. బయట చార్జింగ్ పాయింట్ వద్ద బ్యాటరీ చార్జింగ్ పెడితే 50 నిమిషాల్లో ఫుల్ అవుతుందని, ఒక యూనిట్‌కు రూ.23 ఖర్చవుతుందని చెప్పాడు. మైలేజ్ ఎక్కువ పెరుగుతుందని రోడ్డుపై తక్కువ స్పీడుతో వెళ్లడం ద్వారా రోడ్డు ప్రమాదాలను సైతం కొంతవరకు నివారించొచ్చని చెబుతున్నాడు. 10వేల కిలోమీటర్లకు ఒకసారి కారు సర్వీసింగ్ చేయిస్తే రూ.1,500 నుంచి రూ.2000 వరకు ఖర్చవుతుందని వివరించాడు.

ప్రతీ నెల ఆదా



తుక్కుగూడ: గతంలో బైక్ ఉపయోగించే వాడిని. అప్పుడు పెట్రోల్ కోసం నెలకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు ఖర్చు చేసే వాడిని. మూడేళ్ల నుంచి ఎలక్ట్రిక్ బైక్ వాడుతున్నాను. వాహనానికి చార్జింగ్ పెట్టడం ద్వారా నెలకి రూ.500 వరకు మాత్రమే కరెంటు బిల్లు వస్తోంది. ప్రతీ నెల డబ్బులు ఆదా అవుతున్నాయి.

– తూళ్ల గణేశ్, రావిర్యాల

గ్రామాల్లోనూ విరివిగా వినియోగం



మంచాల: ఎలక్ట్రిక్ వాహనాలు మార్కెట్‌లోకి రావడంతో చాలామంది వాటి వాడకంపై ఆసక్తి చూపుతున్నారు. గ్రామాల్లో వీటి సంఖ్య పెరుగుతోంది. ఒక్క మంచాల గ్రామంలోనే 20కి పైగా ఎలక్ట్రిక్ బైకులను వాడుతున్నారు.

కాలుష్యం లేకుండా..

ఎలక్ట్రిక్ వాహనాల వాడకం అన్ని విధాలా ఉపయోగంగా ఉంది. ప్రధానంగా ఈ వాహనాలు జీరో మెయింటినెన్స్. 6 గంటలు చార్జింగ్‌పెడితే 150 కిలోమీటర్లు నడుస్తుంది. శబ్ద కాలుష్యం, వాతావరణ కాలుష్యం ఉండవు. నగరంలోని నాగోల్‌లో కూడా విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్ బుకింగ్ సౌకర్యం ఉంది. మాకు చాలా బాగుంది.

– దాచిరెడ్డి అమరేందర్ రెడ్డి, మంచాల

సబ్సిడీపై ట్రాలీ ఆటో



బ్యాటరీతో నడిచే ఉలర్ కంపెనీ ట్రాలీ ఆటో ఆరు నెలల క్రితం సబ్సిడీపై తీసుకున్నాను. రూ.5 లక్షల విలువ ఉన్న ఆటో ట్రాలీకి రూ.72 వేలు కేంద్రం సబ్సిడీ రూపకంగా ఇచ్చింది. నార్మల్ ఆటో ట్రాలీ కంటే టైర్లు, ట్రాలీ పెద్దగా ఉన్నాయి. ఈ ట్రాలీలో ఫిల్టర్ చేసిన నీటి ట్యాంకును పెట్టుకొని నిత్యం పలు ఇళ్లకు, ఫంక్షన్లకు, హోటళ్లకు సరఫరా చేస్తుంటాం. గల్లీలు, బస్తీలు తిరగాల్సి ఉండడంతో డీజిల్ ఖర్చు తప్పింది. 50 నిమిషాలు బ్యాటరీ చార్జింగ్ చేస్తే 100 కిలోమిటర్లు తిరగొచ్చు. చార్జింగ్ పెట్టినందుకు నెలకు కేవలం రూ.1,600 విద్యుత్ బిల్లు వస్తోంది. డీజిల్‌కు పెట్టే ఖర్చు తప్పడంతో రోజుకు రూ. 200 ఆదా అవుతోంది. నార్మల్ వాహనం సీసీ 800 ఉంటే దీనికి 1200 సీసీ ఉండటంతో లోడ్‌తోపాటు వేగంగా ఈ ట్రాలీ వెళ్తోంది. క్లచ్ వైర్, బేరింగ్‌లు దెబ్బతినడం, స్టార్టింగ్ సమస్యలు ఉండని కారణంగా మెయింటెనెన్స్ ఖర్చు తగ్గింది.

– జెర్మొని రాజు, వాటర్ ఫిల్టర్ యాజమాని, ఇబ్రహీంపట్నం

పెరుగుతున్న వినియోగం

చేవెళ్ల: కాలుష్య నియంత్రణ, ఖర్చుల నివారణకు ఎలక్ట్రిక్ వాహనాల వాడకం ఊరటగా కనిపోస్తుంది. ప్రస్తుతం వాహనదారులు ఎలక్ట్రికల్ వాహనాల వాడకంవైపు అడుగులు వేస్తున్నారు. రోడ్డుపై పది వాహనాలు తిరిగితే అందులో రెండు నుంచి మూడు ఎలక్ట్రిక్ వాహనాలు కనిపిస్తున్నాయి. సామాన్య ప్రజలు రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు ఇలా ప్రతి ఒక్కరూ వీటిని వినియోగిస్తున్నారు. వీటి వాడకం రోజురోజుకూ పెరుగుతోంది. అనేక వాహనాల కంపెనీలు ఇప్పుడు వీటిని మార్కెట్‌లోకి తీసుకువస్తున్నాయి. ప్రభుత్వాలు ప్రత్యేక రాయితీలు అందిస్తే బాగుంటుందని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు.

ఇంధన వాహనంతో పోలిస్తే బెటర్



ఏడాది క్రితం ఎలక్ట్రిక్ వాహనం టాటా నెక్సాన్ కారు కొన్నాను. గతంలో డీజిల్ వాహనం వాడేవాడిని. దానికి నెలకు సుమారు రూ.30వేల వరకు డీజిల్ ఖర్చయ్యేది. ఇప్పుడు ఈ వాహనం ద్వారా కరెంట్ బిల్లు రూ.5వేల వరకు మాత్రమే వస్తోంది. దీనికి తోడు ఈ వాహనానికి సర్వీస్ చార్జీలు కూడా లేవు కాబట్టి తక్కువలో తక్కువగా నెలకు రూ.20వేలకుపైనే ఆదా అవుతోంది. వాహనం ఖరీదు ఎక్కువగా ఉన్నప్పటికీ నెలకు ఆదా అయ్యే ఖర్చు ఈఎంఐ కట్టడానికి ఉపయోగపడుతోంది. దీనికి తోడు కాలుష్యం తగ్గుతుంది.

– చంద్రశేఖర్‌రెడ్డి, ఇక్కారెడ్డిగూడ



పెట్రోల్ ఖర్చులో సగం కూడా లేదు

పలు ఫాంహౌస్‌లపై సూపర్‌వైజింగ్ చేస్తుంటాను. అక్కడున్న పని వాళ్లు పని చేస్తున్నారా లేదా అని తెలుసుకునేందుకు నిత్యం తిరగాల్సి ఉంటుంది. గతంలో బైక్ ఉండేది. పెట్రోల్ ఖర్చులు ఎక్కువ అవుతుండేవి. ఇటీవల అంతా ఎలక్ట్రిక్ వాహనాలు అంటున్నారని అథర్ కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ స్కూటర్ తీసుకున్నా. నెలకు పెట్రోల్‌కు అయ్యే ఖర్చులో సగం కూడా కావడం లేదు. మార్కెట్‌లో కంపెనీలను బట్టి రూ.1.20 లక్షల నుంచి రూ.2లక్షల వరకు దొరుకుతున్నాయి. నేను రూ.1.30 లక్షలు పెట్టి కొన్నాను. 100 కిలోమీటర్ల రేంజ్ వస్తోంది. రోజుకు దాదాపు 50 కిలోమీటర్ల వరకు తిరుగుతాను. అన్ని విధాలా బాగుంది.

– జనార్దన్‌రెడ్డి, ధర్మాసాగర్

అవగాహన లేక..

కందుకూరు: గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా అంతగా అవగాహన లేదు. అక్కడక్కడ ఒకటి అర మాత్రమే కనిపిస్తున్నాయి. అవసరమైతే మరమ్మతులు చేసేవారు లేక, సాధారణ బైక్‌తో పోల్చితే బరువు లాగడంలో తేడా ఉండటం.. కొద్ది నెలల తర్వాత చార్జింగ్ త్వరగా దిగిపోవడం వంటి సమస్యలతో అంతగా ఆసక్తి చూపించడం లేదు. ఇక్కడ ఉన్న బైక్ షోరూమ్‌లలో కూడా ఎలక్ట్రిక్ బైక్‌ల విక్రయాలు ఇంత వరకు చేపట్టలేదు.

టెక్నికల్ సమస్య వస్తే కష్టం



ఎలక్ట్రిక్ వాహనాలను విక్రయించాలంటే టెక్నికల్ సమస్యలు వస్తే మరమ్మతులు చేసేవారు లేరు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు అంత ఆసక్తి చూపడంలేదు. బరువు వేస్తే చార్జింగ్ త్వరగా దిగిపోవడంతో పాటు సాధారణ బైక్‌కు వీటికి ధరలో రూ.20 వేల వరకు వ్యత్యాసం ఉంటోంది. అందుకే వాటిని కొనడానికి ఎవరూ అంతగా ఆసక్తి చూపడం లేదు. ఇక్కడ ప్రత్యేకంగా చార్జింగ్ స్టేషన్లు లేవు. చార్జింగ్ పెడితే పేలుతున్నాయనే అపోహ ఉంది.

– నాగరాజు, బైక్ షోరూమ్ నిర్వాహకుడు, కందుకూరు

చార్జింగ్ స్టేషన్లు లేవు



నాలుగేళ్ల క్రితం రూ.85 వేలు పెట్టి ఎలక్ట్రిక్ బైక్‌ను కొనుగోలు చేశాను. రెండేళ్ల తర్వాత బ్యాటరీల సామర్థ్యం తగ్గడంతో హైదరాబాద్ షోరూమ్‌కు తీసుకెళ్లాను. వారంటీ గడువు పూర్తవడంతో బ్యాటరీలు కొత్తవి వేయాలని రూ.35 వేలు ఖర్చవుతుందని చెప్పారు. దీంతో ఆ బైక్‌ను రూ.40 వేలకు వారికే అమ్మి కొత్త బైక్ కొనుగోలు చేశాను. చార్జింగ్ నాలుగు గంటలు పెట్టాలి. బయట ఎక్కడా చార్జింగ్ స్టేషన్లు లేవు.

– శ్రీధర్‌రెడ్డి, వినియోగదారుడు, కందుకూరు

ఆరేళ్ల క్రితం కొన్నాను



ఎలక్ట్రిక్ వాహనంతో ఇంధన భారం తగ్గుతోంది. ఆరేళ్ల క్రితం రూ.70వేలకు వాహనం కొనుగోలు చేశా. మూడేళ్ల వ్యవధిలో ఇంధన ఖర్చు లేకపోవడంతో వాహనానికి పెట్టిన డబ్బులు ఇంధన రూపంలో తిరిగి వచ్చినట్లే. మూడేళ్ల తర్వాత రిపేర్ వస్తే హైదరాబాద్‌కు తీసుకెళ్లి చేయించా. ఇప్పటి వరకు ఏ సమస్యా రాలేదు.

– కుమారస్వామి, తాండూరు

సెల్‌ఫోన్‌తో ఆన్.. ఆఫ్



ఓలా ఎలక్ట్రిక్ స్కూటీని కొనుగోలు చేసి ఏడాది అవుతోంది. ఇప్పటి వరకు 5,828 కిలోమీటర్లు తిరిగాను. ఒక్కసారి ఇంట్లో విద్యుత్ చార్జింగ్ చేస్తే 185 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేయొచ్చు. ఏడాదిలో రూ.14 వేల వరకు ఇంధన ఖర్చు తగ్గింది. ఐదు సెకన్ల వ్యవధిలోనే 120 స్పీడ్ అందుకుంటుంది. బ్లూటూత్ సిస్టం ఉండడంతో సెల్‌ఫోన్ ద్వారానే వాహనాన్ని ఆన్, ఆఫ్ చేసుకునే విధానం ఉంది. వాహనం చోరీకి గురవుతుందనే బాధలేదు.

– నరేందర్, కానిస్టేబుల్, తాండూరుటౌన్

చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు అవసరం



ఎలక్ట్రిక్ వాహనాలు చార్జింగ్ చేసేందుకు ప్రభుత్వం జిల్లాలోని ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలి. రూ.30లక్షలు వెచ్చించి ఈఎంఐలో ఎంజీ కంపెనీ కారు కొనుగోలు చేశా. ఎలాంటి చార్జింగ్ అవసరం లేదు. బ్యాటరీ ఫుల్ చార్జ్ చేస్తే కేవలం 350 కిలోమీటర్లే తిరుగుతోంది. బ్యాటరీ సామర్థ్యం 500 కిలోమీటర్లకు పెంచాలి.

– మేగనాథ్‌గౌడ్, మాజీ సర్పంచ్, సంగెం కలాన్

పరిశ్రమలో తనిఖీలు

షాద్‌నగర్‌రూరల్‌: మండల పరిధి బూర్గుల గ్రామ శివారులోని ఆరోహీ హెల్త్‌ కేర్‌ పరిశ్రమలో శుక్రవారం రాత్రి డ్రగ్‌ కంట్రోల్‌ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమలో ఉత్పత్తులకు సంబంధించిన పత్రాలను పరిశీలించినట్లు పరిశ్రమ మేనేజర్‌ ప్రమోద్‌కుమార్‌ తెలిపారు.

బైక్‌ కొనివ్వడం లేదని విద్యార్థి అదృశ్యం

పహాడీషరీఫ్‌: తండ్రి బైక్‌ కొనివ్వడం లేదని ఇంటర్‌ విద్యార్థి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ సంఘటన పహాడీషరీఫ్‌ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి వాదే ముస్తఫా బస్తీకి చెందిన మహ్మద్‌ గులాం పెద్ద కుమారుడు మహ్మద్‌ అవేస్‌(19) ఇంటర్‌ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తనకు బైక్‌ కొనివ్వాలంటూ కొంత కాలంగా అవేస్‌.. తండ్రిని కోరుతున్నాడు. ప్రస్తుతం డబ్బులు లేవని, తర్వాత కొనిస్తానని తండ్రి నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ఈ నెల 1న ఇదే విషయమై ఇంట్లో గొడవ జరిగింది. కాసేపటికే అవేస్‌ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. ఫోన్‌ స్విచ్ఛాఫ్‌ చేశాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో అతడి ఆచూకీ కోసం గాలించారు. ఫలితం లేకపోవడంతో పోలీస్‌ స్టేషన్‌లో గులాం ఫిర్యాదు చేశాడు. ఆచూకీ తెలిసిన వారు ఠాణలో కానీ, ఈ నంబర్‌ 87126 62367కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.



మహ్మద్‌ అవేస్‌(ఫైల్‌)

వ్యక్తి ఆత్మహత్య

నందిగామ: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధి రంగాపూర్‌లో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకోగా.. శనివారం వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్‌ ప్రసాద్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మహేశ్‌(37) బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఘటనా స్థలంలో సూసైడ్‌ నోట్‌ లభించింది. భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్‌ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని షాద్‌నగర్‌ ఆస్పత్రికి తరలించారు.

ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా అధ్యక్షుడిగా పవన్‌ చౌహాన్‌

షాద్‌నగర్‌: ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా అధ్యక్షుడిగా షాద్‌నగర్‌ పట్టణానికి చెందిన పవన్‌ చౌహాన్‌ ఎన్నికయ్యారు. రాజేంద్రనగర్‌లోని ఏఆర్‌ దేవరాజ్‌ భవన్‌లో శనివారం సంఘం జిల్లా కౌన్సిల్‌ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడిగా పవన్‌ చౌహాన్‌, జిల్లా కార్యదర్శిగా వంశీవర్ధన్‌రెడ్డి ఎన్నికయ్యారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆమనగల్లు: హైదరాబాద్‌–శ్రీశైలం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆమనగల్లు మండలం పులుగోనిపల్లితండాకు చెందిన రమేశ్‌నాయక్‌(40) తన ఆటోలో తండాకు వెళ్తుండగా.. పట్టణ సమీపంలోని విఠాయిపల్లి వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో రమేశ్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ వెంకటేశ్‌.. ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్‌ తెలిపారు. మృతుడికి భార్య సీత, ఇద్దరు కుమారులు ఉన్నారు.



పాఠశాలకు బెంచీలు అందజేసిన 1991-92 బ్యాచ్‌ పూర్వమిత్రులు

స్నేహమే జీవితం.. శాశ్వతం

స్నేహం ఓ మధురం. ఓ వరం. గాడాంధకారం అలుముకున్నా.. నిరాశా నిస్పృహలు చుట్టుముట్టినా.. భరించలేని కష్టం బాధపెట్టినా.. నీ కోసం నేనున్నానంటూ వెన్నుతట్టే ఆత్మీయ స్పర్శే స్నేహం. నిజమైన స్నేహం చివరి వరకు తోడుటుంది. ఒంటరిలోనూ.. ఓటమిలోనూ తోడై నడుస్తుంది. కన్నీరు తుడుస్తుంది. కష్టాల్లో ధైర్యం చెబుతుంది. సమాజ సేవకు పరితపిస్తుంది. అలాంటి మైత్రిలోని మాధుర్యం చెప్పడానికి మాటలు చాలవు.

- ఆపదలో ఆపన్నహస్తం
- పేద విద్యార్థులకు భరోసా
- నేడు స్నేహితుల దినోత్సవం

కద్దాల్‌: సమాజ సేవ చేయాలనే ఆలోచన ఆ మిత్రులను ఏకం చేసింది. ఒక్కరిద్దరు కాదు.. ఏకంగా 1991–92వ విద్యాసంవత్సరంలో స్థానిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తిచేసుకున్న బాల్య మిత్రులను జట్టుగా కలిపింది. 2008లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఇదే వేదికగా.. అందరి మదిలో సమాజానికి ఏదైనా చేయాలనే తపన బీజం వేసింది. ఇంకేముంది అనుకున్నదే తడవు.. చేయిచేయి కలిపి తొలుత ఓనమాలు దిద్దుకున్న ప్రాథమిక పాఠశాలకు రూ.50 వేలతో గేటు, చిన్నారులకు ప్లేట్స్‌, దుస్తులు తదితర సామగ్రి అందజేశారు. ఇక నాటి నుంచి మొదలైన సేవా ప్రయాణం.. నేటికీ కొనసాగుతూనే ఉంది. ఉద్యోగ, ఉపాధి, వ్యాపార రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడినప్పటికీ సేవలో తరిస్తూనే ఉన్నారు. జట్టుగా శ్రీనివాస్‌గౌడ్‌, జాహంగీర్‌ అలీ, శ్రీనివాస్‌, అంజయ్య, జంగయ్య, రమేశ్‌గౌడ్‌, మచ్చేందర్‌, పెంటారెడ్డి, దయాకర్‌రెడ్డి రాఘవేందర్‌, వెంకటేశ్‌, చంద్రశేఖర్‌, గిరి, పూర్య తదితరులు 25 మంది ఏర్పడి ఎవరికి ఏ ఆపదా వచ్చినా.. తామున్నామంటూ చేయూతనందిస్తున్నారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు.

ఆ కష్టాలు వీరు పడకూడదు



మేం చదుకునే రోజుల్లో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. నేడు వ్యాపార రంగంలో స్థిరపడ్డాం. సంపాదించిన దాంట్లో కొంత మేర సమాజ సేవకు ఖర్చుచేస్తున్నాం. మేము పడిన కష్టాలు నేటి విద్యార్థులు పడొద్దని భావించాం. ప్రభుత్వ పాఠశాలలకు, చిన్నారులకు కావాల్సిన సామగ్రి అందజేస్తున్నాం. తోడ్పాడునిస్తున్నాం.

– జహంగీర్‌ అలీ, కద్దాల్‌

సేవతోనే తృప్తి



ప్రభుత్వ పాఠశాలల్లో చాలా వరకు నిరుపేద పిల్లలే చదువుకుంటారు. వారికి అండగా నిలవాలనే లక్ష్యంతో బాల్య మిత్రులందరం అండగా నిలుస్తున్నాం. ఆ బడుల అవసరాలను బట్టి సాయం చేస్తున్నాం. ఇకముందు కూడా చేస్తూనే ఉంటాం. సమాజసేవలో తృప్తి చెందుతుంటాం.

– చాట్ల వెంకటేశ్‌, కద్దాల్‌

ఈ బంధం విడదీయనిది

ఇబ్రహీంపట్నం రూరల్‌: ఇబ్రహీంపట్నం ఎల్మినేడు గ్రామానికి చెందిన బజారు భిక్షపతి, కొట్టంలా ఆంజనేయులు వీరిద్దరు ప్రాణ స్నేహితులు. పక్కపక్కనే నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇరువురి వయసులో వ్యత్యాసం ఉన్నప్పటికీ.. ఒకరిని విడిచి ఒకరు ఉండలేదు. ఒకే బడిలో చదువుకున్నారు. సమాజ సేవలో ముందుంటారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, అంగన్‌వాడీల్లో మౌలిక వసతులకు పరితపిస్తారు.



భిక్షపతి, ఆంజనేయులు



షౌకాత్‌, అమీర్‌

అమూల్య బంధం

ఇబ్రహీంపట్నం: వెలకట్టలేని బంధం స్నేహం. ఇబ్రహీంపట్నం పాతబస్టాండ్‌ ప్రాంతంలో నివాసముండే ఎండీ షౌకాత్‌, మహంకాళీనగర్‌ ఎండీ అమీర్లు ప్రాణమిత్రులు. మూడున్నర దశాబ్దాలుగా కలిసిమెలిసి ఉంటున్నారు. నిత్యం కలుస్తుంటారు. కష్టసుఖాలను, వృత్తిపరమైన అంశాలపై చర్చించుకుంటారు. ఎక్కడికి వెళ్లినా ఇరు కుటుంబాల సభ్యులు కలిసే పయనిస్తుంటారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా..

షాబాద్‌: సమాజంలో అన్నిటి కన్నా గొప్పది స్నేహం. స్నేహానికి కులమతాలు లేవు. స్వార్థం ఉండకూడదు. ఎంతమంది ఉన్నా నేనున్నానంటూ భరోసా ఇచ్చేవారే నిజమైన మిత్రుడు అని నిరూపించారు షాబాద్‌ సీఐ బి.కాంతారెడ్డి అతని మిత్రబృందం. వారి స్నేహితుడు శ్రీనివాస్‌రెడ్డి రెండు కిడ్నీలు చెడిపోయి మృతి చెందగా.. బాల్య మిత్రులతో కలిసి రూ.7లక్షలు అతడి పిల్లల పేరిట బ్యాంకులో డిపాజిట్‌ చేశారు. అంతే కాదు ఒక ప్లాట్‌ కొనుగోలు చేసి, శ్రీనివాస్‌ కూతురు పేర రిజిస్ట్రేషన్‌ చేశారు. స్నేహితుడి కుటుంబం అనాథ కాకుండా అండగా నిలిచి.. స్నేహానికి చిరునామాగా నిలిచారు.



కాంతారెడ్డి, సీఐ

18 కి.మీ, 295 ఎకరాలు

- రావిర్యాల టు నెట్‌ జీరోసిటీ వరకు సర్వే షురూ
- ఆరు లేన్లు.. 200 అడుగుల విస్తీర్ణంతో రహదారి
- భూసేకరణకు సర్వే చేపట్టిన రెవెన్యూ యంత్రాంగం
- ఎలివేటెడ్‌ రోడ్డుతో పాటు మెట్రోలైన్‌ విస్తరణ సైతం

సాక్షి,రంగారెడ్డి జిల్లా: కందుకూరు మండలం ముచ్చర్లలో నిర్మించతలపెట్టిన ఫోర్త్‌ సిటీకి చేరుకునే రాచమార్గానికి రెవెన్యూ యంత్రాంగం సర్వే చేపట్టింది. ఔటర్‌ రింగ్‌రోడ్డు రావిర్యాల ఎగ్జిట్‌ 13 నుంచి కొంగరకలాన్‌, ఎలిమినేడు, తిమ్మాపూర్‌, రాచలూరు, పంజగూడల మీదుగా మీర్‌ఖాన్‌పేట వరకు 18 కిలోమీటర్లు.. ఆరులేన్లు.. 200 అడుగుల విస్తీర్ణంలో విశాలమైన ఎలివేటెడ్‌ కారిడార్‌ రోడ్డును నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇటీవల బేగరికంచెలో యంగ్‌ ఇండియా స్కిల్‌ యూనివర్సిటీ శంకుస్థాపనకు విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే రోడ్డు సర్వే పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. ఈ మేరకు రెవెన్యూ అధికారులు శనివారం శాటిలైట్‌ సర్వే పనులు షురూ చేశారు.

రైతులు అభ్యంతరం చెబుతారా?

- ఈ రోడ్డుకు ఇబ్రహీంపట్నం మండలంలో 103 ఎకరాలు, కందుకూరు మండలంలో 192 ఎకరాల చొప్పున మొత్తం 295 ఎకరాల భూమి అవసరమని ప్రాథమికంగా అంచనా వేశారు. ఇప్పటికే ఈ మార్గం నుంచి రోడ్డు కూడా ఉంది. ఇరువైపులా అదనంగా మరికొంత భూమిని సేకరించి, విస్తరింపజేస్తే సరిపోతుంది. భూ సేకరణతో పాటు ఖర్చు కూడా తక్కువ అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఎలివేటెడ్‌ కారిడార్‌ రోడ్డు వెంటే మెట్రోలైన్‌ వేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. ప్రైవేటు పట్టా భూముల నుంచి రోడ్డు నిర్మాణం ఖర్చుతో కూడిన వ్యవహారం.
- భూ సేకరణ విషయంలో రైతుల నుంచి పలు అభ్యంతరాలు వ్యక్తం అయ్యే అవకాశమూ లేకపోలేదు. విలువైన ఈ భూములను రోడ్డుకు ఇచ్చేందుకు నిరాకరించే అవకాశం ఉంది. దీంతో సాధ్యమైనంత వరకు తక్కువ ఖర్చుతో ప్రభుత్వ భూముల నుంచే ఈ రహదారిని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్లాన్‌ చేస్తోంది. ఈ ప్రతిపాదిత రోడ్డు మార్గం నుంచే ఎయిర్‌పోర్టు వరకు మెట్రోలైన్‌ సేవలను విస్తరించనున్నట్లు ప్రకటించడంతో ఆ మేరకు ఏర్పాట్లు చేస్తోంది.

నాలుగేళ్లలో మారనున్న రూపురేఖలు..

అన్నీ సవ్యంగా జరిగితే వచ్చే ఏడాది నాటికి ఈ రోడ్డు పనులు ఓ దశకు చేరుకోనున్నాయి. నాలుగేళ్లలో ఈ ప్రాంత రూపురేఖలను పూర్తిగా మారిపోయి.. న్యూయార్క్‌కు దీటైన అద్భుత నగరం కళ్లముందు ఆవిష్కృతమయ్యే అవకాశముంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో నిన్న మొన్నటి వరకు స్తబ్దుగా ఉన్న రియాల్టీ రంగం మళ్లీ కదలిక వచ్చింది.

నగరానికి నలువైపులా రోడ్లు

ఫ్యూచర్‌ సిటీలో భాగంగా ప్రభుత్వం ఇప్పటికే 13,973 ఎకరాల భూమిని సేకరించి, పది జోన్లుగా విభజించింది. దీనిలో 34 శాతం భూమిని ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ జనరల్‌ పరిశ్రమలకు, 30 శాతం లైఫ్‌సైన్స్‌హబ్‌కు, తొమ్మిది శాతం భూమిని రెసిడెన్షియల్‌ మిక్స్‌డ్‌ యూజెస్‌ కోసం, మరో ఏడు శాతం రెసిడెన్షియల్‌ జోన్‌ కోసం కేటాయించింది. స్పోర్ట్స్‌ హబ్‌కు ఐదు, హెల్త్‌, ఎడ్యుకేషన్‌, వినోదం, పర్యాటకం కోసం మూడు శాతం చొప్పున.. ఫర్నిచర్‌, ఏఐసిటీల కోసం రెండు శాతం చొప్పున భూములు కేటాయించింది. ఈ మేరకు మాస్టర్‌ప్లాన్‌ సిద్ధం చేసింది. మీర్‌ఖాన్‌పేట్‌, బేగరికంచె, ముచ్చర్ల, పంజాగూడ రెవెన్యూల పరిధిలో ఫోర్త్‌సిటీతో పాటు దానికి ఇరువైపులా విద్య, వైద్యం, పర్యాటక, క్రీడా సంస్థల ఏర్పాటుకు ప్రణాళికలు రెడీ చేసింది. ఇప్పటికే వైద్య కళాశాల, ఆస్పత్రి, కమ్యూనిటీ సెంటర్‌, నైపుణ్యాభివృద్ధి సంస్థకు శంకుస్థాపన చేసింది. ఇక జనావాసాలకు దూరంగా కుర్మిద్ద, కడ్తాల్‌ రిజర్వ్‌డ్‌ ఫారెస్ట్‌కు ఆనుకుని ఉన్న భూములను ఫార్మా, పరిశోధన కేంద్రాలకు కేటాయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇటు ఔటర్‌ టు నెట్‌జీరో సిటీ వరకు, అటు కందుకూరు నుంచి, మరోవైపు యాచారం టు మీర్‌ఖాన్‌పేట వైపు రహదారులు ఏర్పాటు చేయాలని భావించింది. ఇప్పటికే శ్రీశైలం జాతీయ రహదారి నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు రూ.225 కోట్లతో 10.5 కి.మీ ఆరు లేన్ల రహదారి నిర్మాణ పనులు పూర్తి చేసింది. మరోవైపు ఇప్పటికే మంజూరై, పలు సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన యాచారం నుంచి ప్రతిపాదిత నగరం వరకు 12 కిలోమీటర్ల దూరంలో వంద అడుగుల రోడ్డు పనుల్లోను కదలిక తీసుకొచ్చింది. ఇందుకు సుమారు 118 ఎకరాల భూమి అవసరమని నిర్ధారించింది. తాజాగా రోడ్లు భవనాలశాఖ అధికారులు గతంలో చేసిన సర్వేను, రోడ్డు మ్యాప్‌ను ఇటీవల పరిశీలించడం కొసమెరుపు.